క్లుప్తంగా

ఆలయ వార్షికోత్సవం



కొలువుదీరిన అమ్మవారు

కుంటాల: మండల కేంద్రంలోని శ్రీ మహాలక్ష్మీ ఆలయ 18వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి అష్టాభిషేకం, అలంకరణ, అర్చన, హారతి, సుగంధ ద్రవ్యాలతో ధూపం, నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. కార్యక్రమంలో జనగామ ఆర్టీవో దంపతులు శ్రీలత–శ్రీనివాస్ గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి పూజలు

లోకేశ్వరం: ఆషాఢమాసం సందర్భంగా మండలకేంద్రంలోని భగీరథ కట్ట ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకం, సహస్ర తులసి, పుష్పాలతో అష్టోత్తర పూజలు జరిపించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని మెండె సంధ్య– వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పూజారి అమూల్ పంతులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి



మృతి చెందిన ఆవు

తానూరు: మండలంలోని వడ్గాం గ్రామానికి చెందిన జక్కాజీ సమర్థ్ కథం అనే రైతు ఆవు శనివారం విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. గ్రామంలో తన ఇంటి పరిసరాల్లో ఆవు మేస్తూ అక్కడున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్తింగ్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధిత రైతు పేర్కొన్నాడు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఆవు కళేబరం పరిశీలించారు. అనంతరం పశువైద్యశాఖ అధికారులు పంచనామా నిర్వహించారు. ఆవు విలువ రూ.40 వేలు ఉంటుందని.. ప్రభుత్వం తమకు ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

కళాశాలలో వన మహోత్సవం



మొక్కలు నాటుతున్న విద్యార్థినులు

లక్ష్మణచాంద: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం వన మహోత్సవం నిర్వహించారు. మండల కేంద్రంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో నడుపుతున్న సహకార జూనియర్ కళాశాలలో వన మహోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల ఆవరణలో విద్యార్థులు మొక్కలు నాటారు. ఇందులో ప్రిన్సిపాల్ భోజన్న, అధ్యాపకులు కిష్టయ్య, రాజేశ్వర్, భోజన్న, రవీందర్, స్వరాజ్యం, స్వప్న, హరిలత తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: మండలకేంద్రంలో శనివారం ఉపాధ్యాయ పరివార్ నాయకురాలు జయ శ్రీ తల్వాల్కర్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. వృక్షమందిర్ దిన్ కార్యక్రమంలో భాగంగా గజ్జలమ్మ ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కదార్ల హరిప్రసాద్, జిల్కరి శ్రీనివాస్, బోగ నర్సయ్య చిన్నారులు పాల్గొన్నారు.

సీఐటీయూలో చేరిక



కండువా కప్పుతున్న సురేశ్

కడెం: మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కడెం సెక్టార్ పరిధి అంగన్‌వాడీ సిబ్బంది శనివారం సీఐటీయూలో చేరారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ వారికి కండువా కప్పి ఆహ్వానించారు. సీఐటీయూ పోరాటంతోనే మినీ అంగన్‌వాడీలను అప్‌గ్రేడ్ చేశారని పేర్కొన్నారు. ఇందులో గీత, సత్య, గంగామణి, గంగవ్వ, రేఖ, గంగవ్వ, కరుణ, హరిప్రియ, శ్రీవాణి, అరుణ తదితరులున్నారు.

ర్యాగింగ్ చేస్తే చర్యలు

ఖానాపూర్: కళాశాలలో ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై రాహుల్ గైక్వాడ్ అన్నారు. శనివారం పట్టణంలోని మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాల విద్యార్థులకు యాంటి ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు స్నేహభావం పెంచుకోవాలని పేర్కొన్నారు. కొందరితో ప్రతిభ కల్గిన విద్యార్థులకు నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. అధ్యాపకులు, సిబ్బంది తదితరులున్నారు.

గ్రీన్ డే

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ గ్లోబల్ అభ్యాస్ పాఠశాలలో శనివారం గ్రీన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు మొక్కల ఉపయోగాలు, పర్యావరణం గూర్చి వివరించారు.

ఆదర్శం.. ఈ సర్కారు బడి

- కుభీర్ ఉన్నత పాఠశాలలో సకల సౌకర్యాలు
- చేరేందుకు క్యూ కడుతున్న విద్యార్థులు
- ఈ ఏడాది 95 మందికి ప్రవేశం

ప్రైవేటుకు ధీటుగా సకల సౌకర్యాలతో మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల కొనసాగుతోంది. ఉపాధ్యాయుల ఉత్తమ బోధన, పదోతరగతిలో మంచి ఫలితాలు, డిజిటల్ తరగతులు, కంప్యూటర్ విద్య, యోగా తదితర సౌకర్యాల కారణంగా ఈ బడిలో చదువుకునేందుకు విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. పాఠ్యాంశాలతోపాటు మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ తరగతులు, కంప్యూటర్ విద్యను అందిస్తున్నారు. తరగతి గది గోడలపై మహనీయుల మాటలు, చిత్రాలను గీయిస్తూ విద్యార్థుల్లో ఉన్నత ఆలోచనలకు బీజం వేస్తున్నారు. వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ.. వారిని క్రమశిక్షణ కల్గిన భావిపౌరులుగా తీర్చిదిద్దుతున్నారు. – కుభీర్

412 మంది విద్యార్థులు.. 26 మంది టీచర్లు

కుభీర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదోతరగతి వరకు 412 మంది విద్యార్థులు చదువుతుండగా 26 మంది ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు. ఈ విద్యాసంవత్సరం (2025–26)లో 95 మంది అడ్మిషన్ తీసుకున్నారు. టీసీ తేకపోవడంతో మరో 15 మంది పాఠశాలకు వస్తున్నా.. వారి పేర్లు రిజిస్టర్‌లో నమోదు చేయలేదని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఆగస్టు నెల నాటికి విద్యార్థుల సంఖ్య మరింత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అటెండర్‌ను నియమించుకున్న ఉపాధ్యాయులు..

గత సంవత్సరం నుంచి పాఠశాలకు అటెండర్ లేకపోగా ఉపాధ్యాయులు నెలకు రూ.200 జమ చేసుకొని ఓ ప్రైవేటు వ్యక్తిని అటెండర్‌గా నియమించుకున్నారు. మరోవైపు పచ్చదనానికి ప్రాధాన్యతనిస్తూ పాఠశాల ఆవరణను మొక్కలు నాటడంతో ఏపుగా పెరిగాయి. పాఠశాలలో 2002లో పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులు సరస్వతీ మాత మందిరం ఏర్పాటు చేశారు. గతేడాది పదో తరగతి ఫలితాల్లో 100శాతం ఉత్తీర్ణత నమోదైంది. పాఠశాలలో ఎన్‌సీసీ ఉండగా ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు తరచుగా నిర్వహిస్తుంటారు. పలువురు ఉపాధ్యాయులు తమ తల్లిదండ్రుల స్మారకార్థం 15 సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. పాఠశాల విద్యార్థులకు మినరల్ వాటర్‌ను గ్రామానికే చెందిన ఓ దాత ఆనంద్‌సేట్ సరఫరా చేస్తున్నారు.

సమస్యలూ ఉన్నాయి..

గతంలో పాఠశాలలో ఉన్న ఇద్దరు స్వీపర్లలో ఒకరు బదిలీపై మరోచోటకు వెళ్లగా మరొకరు పదవి విరమణ పొందారు. వారి స్థానంలో ప్రభుత్వం ఎవరిని నియమించలేదు. దీంతో ఉపాధ్యాయులే ఓ వ్యక్తిని అటెండర్‌గా నియమించుకొని నెలకు రూ.5వేల వరకు ఇస్తున్నారు. గతంలో నిర్మించిన వంటగది చిన్నదిగా ఉంది. ఆవరణలో ఉన్న ఓ భవనం శిథిలావస్థకు చేరడంతో ఇటీవల దానిని కూలగొట్టారు. కొత్త భవనానికి నిధులు మంజూరైనా పనులు ప్రారంభించలేదు. ఉపాధ్యాయుల కొరత ఉంది.. ఇంగ్లిష్ చెప్పే హరిహన్ డిప్యూటేషన్‌పై మరోచోటకు వెళ్లారు. సాంఘికశాస్త్రం బోధించేందుకు ముగ్గురు ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా ఒకరు లక్ష్మణచాందకు డిప్యుటేషన్‌పై వెళ్లారు. ప్రస్తుతమున్న ఇద్దరిలో ఒకరు వచ్చేనెలలో రిటైర్ కానున్నారని సమాచారం. అప్పుడు ఒక్కరికే అన్ని తరగతులు బోధించడం కష్టమవుతుంది. గదులు సరిపోకపోవడంతో అప్పుడప్పుడు విద్యార్థులకు చెట్ల కింద పాఠాలు చెబుతున్నారు.

ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.



ప్రార్థనలో విద్యార్థులు

ఇక్కడే చదివి ఉపాధ్యాయుడినయ్యా..



నాది కుభీర్ గ్రామమే. నేను బాల్యంలో ఇదే పాఠశాలలో చదువుకొని ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యా. ప్రైవేటుకు ధీటుగా పేదింటి బిడ్డలకు నాణ్యమైన విద్య అందించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.
– నల్ల గంగాధర్, హెచ్‌ఎం, కుభీర్

చక్కగా బోధిస్తున్నారు..



మా ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా వింటున్నాం. వారు కూడా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి మెరుగయ్యేలా తీర్చిదిద్దుతున్నారు. యోగా సైతం నేర్పిస్తున్నారు.
– ఎ.మణికంఠ, పదోతరగతి

భవనం సరిపోవడం లేదు..



మా పాఠశాలలో అంటెండర్లు లేరు. ప్రస్తుతం ఉన్న భవనం సరిపోవడం లేదు. ఉపాధ్యాయుల కొరత ఉంది.వంట గది మంజూరు చేయాలి. మేము చక్కగా చదువుకుంటున్నాం.
– అంజలి, పదోతరగతి



కంప్యూటర్ నేర్చుకుంటున్న విద్యార్థులు



యోగా చేస్తున్న విద్యార్థులు



డిజిటల్ తెరపై పాఠం బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

నేడు బోనాల పండుగ

కుంటాల: ఆషాఢమాసం పురస్కరించుకొని ఆదివారం కుంటాలలో బోనాల పండుగ నిర్వహిస్తున్నట్లు గొడిసెల కుటుంబ పరివార్ సభ్యులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దీనికి ఎమ్మెల్యే రామారావు పటేల్ ముఖ్య అతిథిగా హాజరవుతారని.. భక్తులు తరలివచ్చి వేడుకను విజయవంతం చేయాలని కోరారు.

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు గడువు పెంపు

తానూరు: ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశానికి గడువు తేదీని ఈనెలాఖరు వరకు పొడిగించినట్లు మండలంలోని ఎల్వి జిల్లా పాఠశాల హెచ్‌ఎం, కోఆర్డినేటర్ నరేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కల్గినవారు ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ఎల్వి పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

పద్యకవికి సన్మానం



పద్యకవిని సన్మానిస్తున్న సభ్యులు

దస్తురాబాద్: సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో శనివారం మంచిర్యాల జిల్లాకేంద్రంలో నిర్వహించిన సాహితీ విపంచి పుస్తకావిష్కరణలో మండల కేంద్రానికి చెందిన శేషం శఠగోపం నరేశాచార్యులు రాసిన ఓటు విలువ పద్య కవితకు ఆరో సంచికలో చోటు కల్పించారు. అనంతరం నరేశాచార్యులను సాహితీ సంరక్షణ సభ్యులు వామన్‌రావ్, అన్వర్, సుబ్బయ్య ఘనంగా సన్మానించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



చెక్కు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసారూరల్: మండలంలోని పాంగ్రి గ్రామంలో సత్యశీలకు రూ.41 వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. శనివారం మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి తన నివాసంలో బాధిత కుటుంబసభ్యులకు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సూర్యకాంత్‌రెడ్డి, రాజన్న, ఉత్తం బాలేరావు, పోతారెడ్డి, ఆకాశ్, సాహెబ్‌రావు, సాయిప్రసాద్, దేవుజీ, శ్యాందాస్, నాగేశ్, నాగేందర్, విఠల్ తదితరులు ఉన్నారు.

అవకాశాలు అందిపుచ్చుకోవాలి

- ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, అనిల్‌జాదవ్
- ఖానాపూర్‌లో బీఆర్‌ఎస్ జాబ్‌మేళాకు స్పందన



వేదికపై మాట్లాడుతున్న జాన్సన్‌నాయక్

ఖానాపూర్: యువత అవకాశాలు అందిపుచ్చుకొని జీవితంలో స్థిరపడాలని ఆసిఫాబాద్, బోథ్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, అనిల్ జాదవ్ అన్నారు. శనివారం పట్టణంలోని ఏఎంకే ఫంక్షన్‌హాలులో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ ఆధ్వర్యంలో సుమారు 60కిపైగా కంపెనీలతో మెగా జాబ్‌మేళా నిర్వహించగా వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. యువ నాయకుడు జాన్సన్ నాయక్ నియోజకవర్గ ప్రజల కోసం పాటుపడే వ్యక్తి అని కొనియాడారు. బీఆర్‌ఎస్ హయాంలో కేటీఆర్ చొరవతో రాష్ట్ర ఐటీ కారిడార్ ఏర్పాటు చేయడంతోనే నేడు ఎన్నో కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జాన్సన్ నాయక్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు అండగా నిలిచేందుకు ఏటా జాబ్‌మేళా నిర్వహిస్తానని ప్రకటించారు. జాబ్‌మేళాకు 5200 నిరుద్యోగులు హాజరవగా 860 మందికి నియామక పత్రాలు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. మరో 300 మంది షార్ట్ లిస్టు తయారు చేశామని వివరించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన నిరుద్యోగులకు భోజనం ఏర్పాటు చేశారు. అంతకముందు పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తా నుంచి జగన్నాథ్‌రావు చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ జెడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, నాయకులు భరత్ చౌహాన్, రాంకిషన్‌రెడ్డి, రాము నాయక్ తదితరులున్నారు.

బాధితులకు నాయకుల పరామర్శ



ముధోల్ : తరోడాలో పరామర్శిస్తున్న ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే రామారావు పటేల్



సారంగపూర్: పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, తదితరులు

ముధోల్: మండలంలోని తరోడా గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ లక్ష్మీ నర్సాగౌడ్‌కు ఇటీవల హైదరాబాద్‌లో గుండె ఆపరేషన్ జరుగగా శనివారం ఆయనను ఆదిలాబాద్ ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే రామారావు పటేల్ పరామర్శించారు. ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. మాజీ సర్పంచ్‌లు శ్యామ్‌రావు, ఉత్తం బాలేరావు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఐకేరెడ్డి పరామర్శ

సారంగపూర్: మండలంలోని స్వర్ణ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, అడెల్లి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఉట్ల రాజేశ్వర్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని శనివారం మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పరామర్శించారు. ఈసందర్భంగా మృతికి కారణాలను తెలుసుకున్నారు. ఆయన వెంట పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అట్ల మహిపాల్‌రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ అయిర నారాయణరెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



రమేశ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఎమ్మెల్యే బొజ్జు పరామర్శ

ఖానాపూర్: అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేశ్‌ను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పరామర్శించారు. ఈ సందర్భంగా వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కార్యక్రమంలో నిమ్మల శ్రీనివాస్ తదితరులున్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో ఆదాయం



మెదన్‌పూర్‌లో అవగాహన కల్పిస్తున్న జావిద్‌పాషా

కుంటాల: ఆయిల్‌పాం సాగుతో మంచి ఆదాయం వస్తుందని భైంసా డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి జావిద్ పాషా సూచించారు. శనివారం మండలంలోని ఓలా, మెదన్‌పూర్ గ్రామాల్లోని రైతులకు ఆయిల్‌పాం సాగుపై అవగాహన కల్పించారు. ఉద్యానవనశాఖ ద్వారా పండ్ల తోటలు, ఆయిల్‌పాం సాగు, తీగజాతి, కూరగాయల సాగుకు ప్రభుత్వం 50 శాతం రాయితీ అందించి ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. రాయితీపై డ్రిప్ పరికరాలు అందుబాటులో ఉన్నాయని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ అధికారి శ్రీనివాస్, రైతులు ఆనందబాయి, భీమన్న, కల్యాణ్, దిగంబర్‌పటేల్, రాము పాల్గొన్నారు.

పెచ్చులూడే చోట సన్మానమా.?



జిల్లాలోని బాసర జ్ఞానసరస్వతీదేవి ఆలయంలో శనివారం మంత్రులు కొండా సురేఖ, వివేక్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్షరాభ్యాస మండపంలో పెచ్చులూడే చోట వారికి సన్మానం ఏర్పాటు చేశారు. పాలకులు వస్తున్నారని తెలిసినా.. ఆలయ ప్రాంగణంలో మరమ్మతులు చేపట్టకపోవడం ఏంటని పలువురు ఆలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

కాలువ ఇలా.. నీరు పారేదెలా?



మొర్రిగూడెం సమీపంలో..

కడెం: మండలంలోని కన్నాపూర్, కొండుకూర్, బెల్లాల్, మొర్రిగూడెం తదితర గ్రామాలకు సాగు నీరు అందించే కడెం ప్రాజెక్ట్ కుడి కాలువ చెత్తాచెదారం, పిచ్చిమొక్కలతో నిండి అధ్వానంగా మారింది. ఖరీఫ్ సాగు పనులు ప్రారంభమైనందున మరమ్మతులు చేయించి.. చివరి ఆయకట్టు వరకు సాగునీరందేలా చూడాలని ఆయకట్టు రైతులు వేడుకుంటున్నారు.

ముమ్మరంగా ఫీవర్ సర్వే



భూత్కూర్‌లో సర్వే చేస్తున్న సిబ్బంది

దస్తురాబాద్: మండలంలోని మున్యాల, గొడిసీర్యాల, రేవో జీ పేట, బుట్టాపూర్, మల్లాపూర్, భూత్కూర్, దస్తురాబాద్, ఆకొండపేట, దేవునిగూడెం, పేర్కపల్లె, కడెం మండలంలోని అంబారిపేట, ఉడుంపూర్ గ్రామాల్లో దస్తురాబాద్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నట్లు ఆరోగ్య విస్తరణాధికారి ఎస్.కన్నయ్య తెలిపారు. శనివారం మండలంలోని భూత్కూర్ గ్రామంలో వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు సర్వే చేసి ప్రజలకు పలు సూచనలు చేశారు.

చండీయాగానికి రావాలని ఆహ్వానం



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామారావు

భైంసాటౌన్: లోక కల్యాణార్థం ఈనెల 14, 15,16 తేదీల్లో ధూప దీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో పంచకుండాత్మక చండీ కుబేర పాశుపత యాగం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు యాగానికి రావాలని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌ను కోరారు. శనివారం పట్టణంలోని ఆయన నివాసంలో కలిసి కార్యక్రమ కరపత్రాలు ఆవిష్కరించారు. మూడు రోజులు పాటు నిర్వహించే యాగానికి భక్తులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మంతయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గిరీష్ మహరాజ్, ముధోల్, భైంసా మండలాల అధ్యక్షులు గంగాధర్, దత్తాత్రి, పూజారులు అజయ్ పాఠక్, రుషికేశ్ ఉన్నారు.